www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 డిసెంబరు 2022
5
ఏలూరు

రైతులకు ఇబ్బంది లేకుండా వాహనాలు ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఏలూరు ప్రతినిధి:ధాన్యం రవాణాలో రైతులకు అసౌకర్యం కలగకుండా లారీ అసోషియేషన్ ద్వారా వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ మంజుభార్గవి తెలిపారు. నాలుగో తేదీన 'లారీలు పంపండి మహోప్రభో' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సహకారసంఘాల ద్వారా, ఆర్‌బికెల వద్ద తగినన్ని గోనె సంచులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రైతులకు అసౌకర్యం కలగకుండా క్షేత్రస్థాయిలో తేమశాతం పరిశీలించడానికి సొసైటీల ద్వారా తగిన సిబ్బందిని, గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెల నుండి రైస్ మిల్లులకు రవాణా చేస్తున్నామన్నారు. అంతేకాకుండా రైతులు ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తే వారికి రావాల్సిన రావాణా ఖర్చులు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. అవసరమైన చోట్ల క్షేత్రస్థాయిలో మండలాల వారీగా సంబంధిత అధికారులను నియమించామన్నారు.

రబీ పనులు ముమ్మరం..!

'పశ్చిమ'లో 250 ఎకరాల్లో నారుమళ్లు పూర్తి
ఏలూరు జిల్లాలోనూ ముమ్మరంగా పనులు
20వ తేదీకి నారుమళ్లు పూర్తయ్యే అవకాశం
1121 విత్తనంపై మక్కువ చూపుతున్న రైతులు
కొల్లేరు భూముల్లో వరిసాగుకు ఇ-క్రాప్‌పై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాలవ్యాప్తంగా రబీ పనులు ఊపందుకున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని రబీసాగుకు రైతులు నడుంబిగించారు. దీంతో రెండు జిల్లాల్లోనూ ముమ్మరంగా నారుమడుల ప్రక్రియ సాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 70,104 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలో 250 ఎకరాల్లో నారుమడులు పూర్తవ్వగా, ఏలూరు జిల్లాలోనూ ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 20వ తేదీకల్లా రెండు జిల్లాల్లోనూ రబీ నారుమడులు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ముందే వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పొచ్చు. ఈ ఏడాది రబీసాగుకు సాగునీటి సమస్య లేదని రెండు జిల్లాల్లోనూ సాగునీటి సలహా మండలి సమావేశాల్లో స్పష్టం చేశారు. గోదావరిలో దాదాపు 102 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు లెక్కలు తేల్చారు. ఏప్రిల్ పదో తేదీ వరకూ కాలువలకు నీరు విడుదల సాగనుంది. త్వరగా రబీ నాట్లు పూర్తయితే రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం తగ్గనుంది. రబీలో రైతులు అత్యధికంగా అధికారులు సూచించిన 1121 విత్తనాలను సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ పలు చోట్ల బొండాల విత్తనంతో పాటు 1153, 1156 విత్తనాలను సైతం సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విత్తనాలు దిగుబడి ఎక్కువ రావడంతోపాటు, ఇబ్బందులు తక్కువగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. అయితే బొండాలు, 1153, 1156 రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు. దీంతో రబీ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఈ విత్తన రకాల పంటను సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు రబీలో కొనుగోళ్లపైనా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదేవిధమైన పరిస్థితులు నెలకొంటే ఏమిటనే ఆందోళన వారిని వెంటాడుతోంది. నీటిఎద్దడి సమస్య లేదని చెప్పడంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకుంటున్నారు. మరో వారం, పది రోజుల్లో రబీ పనులు మరింత ముమ్మరంగా సాగనున్నాయి.

కొల్లేరు భూముల్లో సాగుపై ఆందోళన

కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో వందల ఏళ్ల నుంచి రైతులు వరిసాగు చేస్తున్నారు. ఈ భూములను 'అనసరి' భూములుగా పిలుస్తారు. ఈ భూములన్నీ పేద, మధ్యతరగతి రైతులవే. ఈ భూములకు పట్టాలు, పాస్‌బుక్‌లు ఏమీ ఉండవు. కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో నిబంధనలకు అనుగుణంగా సంప్రదాయ వ్యవసాయం చేసుకోవచ్చునని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అందుకు అనుగుణంగానే రైతులు కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో దశాబ్దాలుగా వరిసాగు చేస్తున్నారు. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఆకివీడు వంటి పలు మండలాల్లో అనసరి భూములు ఎక్కువగా ఉన్నాయి. వేలాది ఎకరాల భూముల్లో రైతులు రబీ సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో తెచ్చిన నూతన విధానం చూసి కొల్లేరు భూముల్లో వరిసాగు చేసే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇ-క్రాప్‌లో నమోదైతేనే ధాన్యం కొనుగోలు చేసేవిధంగా నిబంధనలు పెట్టారు. అనసరి భూములను ఇ-క్రాప్‌లో నమోదు చేస్తారా, లేక అభయారణ్యం నిబంధనలు తెరపైకి తెచ్చి తప్పించుకుంటారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇ-క్రాప్ చేయకపోతే పంట పండిన తర్వాత రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

10కె రన్‌లో ఉపాధ్యాయులు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని 10కె రన్

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని, ఒపిఎస్ మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుండి యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన 10కె రన్‌ను ఆయన ఆదివారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ జెడ్‌పి నుంచి ప్రారంభమై ఓవర్‌బ్రిడ్జి, పాత బస్టాండ్, కర్రల వంతెన, పవర్‌పేట, ఆర్‌ఆర్‌పేట, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా తిరిగి జెడ్‌పి కార్యాలయానికి చేరుకుంది. అనంతరం సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ని రద్దు చేస్తామని ఒపిఎస్‌ని పునరుద్ధరిస్తామని ఈ విషయంలో మాట తప్పనని, మడమ తిప్పనని చెప్పి నేడు ఆయన అనుచరులతో పాదయాత్ర సందర్భంగా అవగాహన లేకుండా హామీ ఇచ్చామని చెప్పడం హాస్యా స్పదంగా ఉందన్నారు. ఆ హామీని అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాం బాబు, అధ్యక్షులు ఆర్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పివి.నరసింహా రావు, కార్యదర్శులు ఎంవి.అప్పారావు, బివి.రవీంద్ర, ఎస్. సుధారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూరేటి శ్రీనివాస్, నున్న ఆంజనేయులు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.కమల్ కుమార్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు

ఏలూరు అర్బన్:పేదరికం వల్ల చదువుకు ఎవరూ దూరం కాకుండా సమాజం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో నిర్వహిస్తున్న బుక్‌బ్యాంక్‌లో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.హైమావతి అధ్యక్షత వహించారు. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు జి.శారద వక్తలకు స్వాగతం పలికారు. సుమారు 35 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, విజిఎంవిఆర్.కృష్ణారావు, పీడీ రత్నాకరరావు, ఎస్.కస్తూరిరావు, మేతర అజయ్‌బాబు, కొహిమాల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పుట్టినరోజు, పెళ్లిరోజు, కుటుంబ పెద్దల సంస్మరణ, స్వదేశాగమన సందర్భాల్లో ఇతరులకు సహాయం చేసే సాంప్రదాయం ఉన్న వారిని పేద విద్యార్థుల చదువుకు తోడ్పడాలని ఆలోచింపచేసేందుకు బుక్ బ్యాంక్ నిర్వహణ ద్వారా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. బుక్‌బ్యాంక్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘంటసాల గాత్రం.. ఒక వరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గాన గాంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ఆవరణలో ఉన్న ఘంటసాల విగ్రహానికి అభిమాన గాయకులు చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, ట్రాన్స్‌కో రిటైర్డ్ ఉద్యోగి పోతునూరు నాగభూషణం పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ ఘంటసాల గాత్రం తెలుగు వారికి ఒక వరమని, తెలుగు భాష ఉన్నంతవరకూ తెలుగు ప్రజల హృదయాలలో చిరంజీవిగా ఉంటారని వారు కొనియాడారు, ఘంటసాల ఆలపించిన దేశభక్తి గీతాలు పుష్పవిలాపం, బహుదూరపు బాటసారి, రావోయి బంగారు మామ వంటి గీతాలు, శ్లోకాలు, భక్తి గీతాలు, ప్రణయ గీతాలు విప్లవ గీతాలతో తెలుగు సినీ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన మహనీయులని కొనియాడారు. ఘంటసాల పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆలాపిస్తూ డాక్టర్ శరత్ చంద్ర వీరాస్వామి వంటి ఘంటసాల శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని కొనియాడారు.



ఏలూరులో..

జంగారెడ్డిగూడెం:ఘంటసాల శత జయంతి వేడుకలను స్థానిక రామాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య నాయకులు చిన్ని రామసత్యనారాయణ మాట్లాడుతూ మహాగాయకులు ఘంటసాల తెలుగుజాతికి వరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ ట్రస్ట్ అధ్యక్షులు కెఎన్.రెడ్డి, స్థానిక గాయకులు, విగ్రహ వ్యవస్థాపకులు సబ్బయాచారి, ఫ్రాన్సిస్, కె.నీరజ, పద్మ, గౌరి, రచయిత, నటుడు టి.రామకృష్ణ పాల్గొన్నారు.

3300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

గణపవరం:మండలంలో ఇప్పటి వరకూ 3300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు జిల్లా పరిషత్ సిఇఒ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారి కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా సాగుతు ందని పేర్కొన్నారు. కొనుగోలులో సమస్యలు లేకుండా ప్రశాంతంగా సాగుతుందన్నారు. శనివారం 211.32 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 3300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లులకు తరలిం చినట్లు చెప్పారు. మండలంలో గోనె సంచులు కొరత లేదని, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో 50 వేల సం చులు అందుబాటులో ఉన్నాయని రవికుమార్ తెలిపారు.

7న ధర్నా జయప్రదానికి పిలుపు

గణపవరం:మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల ఏడో తేదీన గణపవరం ఎంఇఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి ఎస్తేరు రాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్న భోజనం కార్మికలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈ ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్య.కా.స 29వ రాష్ట్ర మహాసభకు జంగారెడ్డిగూడెం ముస్తాబు

8న భారీ ప్రదర్శన, బహిరంగ సభ - పాల్గొనున్న బృందాకర్, ఆలిండియా నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్నాయి. దీనికి సంబంధించి జంగారెడ్డిగూడెం పట్టణం ముస్తాబవుతోంది. మహాసభ నిర్వహణకు 12 రకాల కమిటీలు ఏర్పాటు చేసి ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం అన్ని గ్రామాల్లోనూ సంఘం జెండాలు, తోరణాలతో అలంకరణ ఇప్పటికే పూర్తయ్యిందన్నారు. ఎనిమిదో తేదీన వేలాది మంది వ్యవసాయ కార్మికులు, పేదలు, దళితులు, మహిళలు, రైతులు, కార్మికులతో భారీ ప్రదర్శన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమవుతుందని, ప్రధాన మార్గంలో సాగి బస్టాండ్ వద్దకు చేరుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత నాయకులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, వి.శ్రీనివాసరావుతోపాటు వివిధ జిల్లాల నుండి హాజరవుతున్న ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. బహిరంగ సభ ప్రాంగణం ఇప్పటికే అలంకరణ పూర్తయ్యిందన్నారు. ప్రదర్శన అనంతరం జరిగే బహిరంగ సభలో గిరిజన ఉద్యమ అఖిల భారత నేత బృందాకరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని, వివిధ రాష్ట్రాల నాయకులు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి వివిధ సంస్థలు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు సహాయ సహకారాలు అందించారన్నారు. ప్రతినిధుల సభ దండమూడి రామలక్ష్మి కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతినిధుల సభకు వివిధ జిల్లాల నుండి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఓటు హక్కుకు 688 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, చేర్పులు, ఓటు బదిలీల దరఖాస్తుల స్వీకరణ కోసం ఆదివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని అధికారులు వెల్లడించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 213 పోలింగు కేంద్రాలున్నాయి. ఉంగుటూరు మండలంలో 66, భీమడోలు 53, నిడమర్రు 38, గణపవరం 56 పోలింగు కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు 688 క్లెయిములను స్వీకరించారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు వారి నుంచి 260 దరఖాస్తులు స్వీకరించారు. 19 ఏళ్లు పైబడిన వాళ్లు 234 మంది, ఫారం-7లో 165, ఫారం-8కి 29 మొత్తం 688 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహశీల్దార్ ఎవి.రమణారావు వెల్లడించారు. శని, ఆదివారాల్లో మొత్తం 1210 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల డిటి కిరణ్మయి వెల్లడించారు.

విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్ కృష్ణజ్యోతి

మెనూ అమలు చేయకుంటే చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. చింతలపూడి పట్టణంలో అదివారం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆమె ఆకస్మాక తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైనా భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేంద్ర, సివిల్ సప్లయిస్ డిటి జరీన, మండల వ్యవసాయాధికారి మీనాకుమారి పాల్గొన్నారు.

ఆసరా మూడు విడతల్లో రూ.167.81 కోట్లు జమ

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్ఆర్ సున్నావడ్డీ పథకంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ద్వారా జిల్లావ్యాప్తంగా మొదటివిడత 34,335 డ్వాక్రా సంఘాలకు రూ.59.55 కోట్లు, రెండో విడత 39,158 డ్వాక్రా సంఘాలకు రూ.49.44 కోట్లు, మూడో విడత 41982 గ్రూపులకు రూ.58.94 కోట్లను రాష్ట్రప్రభుత్వం జమచేసిందని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు తెలిపారు. సున్నా వడ్డీ పథకంలో మొత్తం మూడు విడతల్లో రూ.167.81 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. మూడేళ్ల పరిపాలనలో నవరత్నాల పథకం అమలులో డిఆర్‌డిఎ ద్వారా జిల్లాలో ఆసరా పథకంలో రెండు విడతల్లో రూ.657.53 కోట్లు జమయ్యాయన్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ ద్వారా 12,712 డ్వాక్రా గ్రూపులకు రూ.572.11 కోట్ల రుణం అందజేశారన్నారు. జిల్లాలో 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (డిఆర్‌డిఎ) ద్వారా స్త్రీనిధి ద్వారా 16,772 మంది డ్వాక్రా సభ్యులకు రూ.58.21 కోట్లు రుణం రూపంలో అందజేశామని తెలిపారు. 40,198 డ్వాక్రా సభ్యులకు రూ.200.99 కోట్లు టార్గెట్ పెట్టుకోగా అందులో 16,772 డ్వాక్రా సభ్యులకు రూ.58.21 కోట్లు రుణం రూపంలో అందజేశారని తెలిపారు.

త్యాగధనులన్నారు.. ముంచేశారు..!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై పోలవరం నిర్వాసితులు తీవ్ర అసంతృప్తి
ప్రాజెక్టు పనులపైనే శ్రద్ధ.. పునరావాసం, పరిహారం పంపిణీపై అశ్రద్ధ
పాలకులు స్పందించకపోతే పోరాటాలు ఉద్ధృతం
ప్రాజెక్టు నిర్వాసితులు స్పష్టీకరణ

ప్రజాశక్తి - పశ్చిమడెస్క్

పోలవరం ప్రాజెక్టు పేరు చెప్పగానే పనులెంత వరకూ వచ్చాయని అంతా అడుగుతుంటారు. అయితే ఆ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస కాలనీలు, పరిహారం, ప్యాకేజీ ఎంత వరకూ అందించారనేది ఏ ఒక్కరూ పట్టించుకోరు. ఫలితంగా అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వ విధానాలతో పోలవరం నిర్వాసితులు తమ భవిష్యత్తు ఏమిటో అర్థం కాక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. పలుమార్లు శంకుస్థాపనలు కూడా జరిగాయి. ఎట్టకేలకు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూసేకరణ చేపట్టారు. కాల్వలు తవ్వారు. తర్వాత చంద్రబాబు హయాంలో ఈ పనులు చురుగ్గా సాగాయి. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ పనులు నేరుగా చేపట్టాల్సి ఉంది. అయితే తామే పనులు నిర్వహిస్తామని నాడు సిఎంగా ఉన్న చంద్రబాబు బాధ్యత తీసుకున్నారు. పనులిచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంగాని, బాధ్యత తీసుకున్న రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వంగాని నిర్వాసితుల విషయంపై స్పష్టత లేకుండా ముందుకు సాగాయి. కనీసం భూసేకరణ చట్టంతోపాటు గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కి పోలవరం మండలంలోని కొన్ని గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించారు. సర్వం కోల్పోయి నిర్వాసితులవుతున్న గిరిజనులకు రూపాయి పరిహారం, ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రాలేదు. అయితే గిరిజనుల తరలింపునకు ఖర్చు చేశామంటూ పెద్దఎత్తున సొమ్మును అధికార యంత్రాంగం స్వాహా చేసిందనే విషయం వెలుగులోకి వచ్చింది. అయినా నాడు ప్రభుత్వం స్పందించిన దాఖలాల్లేవు. పనుల పురోగతి పరిశీలనకు చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శించినప్పుడల్లా నిర్వాసితులు త్యాగధనులు అనడం తప్ప పరిహారం, ప్యాకేజీ, పునరావాసంపై కేంద్రంను నిలదీసిన పరిస్థితిగాని, అవి క్షేత్రస్థాయిలో ఏమేర అమలవుతున్నాయో పరిశీలించిన దాఖలాలుగాని లేవు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీరూ అలానే ఉంది. కనీసం నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు సైతం నీటి మూటలయ్యాయి. రాజశేఖర్‌రెడ్డి హయాంలో సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం, పునరావాసం, ప్యాకేజీ, పరిహారం అన్నీ సకాలంలో పూర్తి చేస్తామని నాడు జగన్ పదేపదే చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చాక కానరాని పరిస్థితి ఉంది. కాపర్ డ్యామ్ నిర్మాణంతో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో గోదావరికి వరద వచ్చినప్పుడు పరిస్థితి భయానకంగా ఉంటోంది. సమీపంలో ఉన్న కొండలు, గుట్టలపైకెక్కి తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్యాకేజీ చెల్లింపునకు మండలం మొత్తం యూనిట్‌గా తీసుకోవాలని ఎపి గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం, సిపిఎం చాలాకాలంగా కోరుతూనే ఉన్నాయి. కాంటూర్ లెక్కలు సక్రమంగా లేవని చెప్పినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలు ప్రభుత్వ లోపాలను బట్టబయలు చేశాయి. నిర్వాసితుల కోసం కివ్వాకలో నిర్మించిన పునరావాస కాలనీ జలమయం కావడం అందరినీ ఆలోచింపజేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకుండానే వచ్చిన వరదలకు నిర్వాసిత కాలనీయే నీట మునిగిందంటే ప్రభుత్వ తీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో కుక్కునూరు మండలం మొత్తం ముంపులో ఉంది. అయితే ప్రభుత్వం 41.15 కాంటూర్ ప్రకారం మొదటి విడతలో ఎనిమిది గ్రామాలు ముంపులో ఉన్నాయని, వాటికి ముందుగా పరిహారం చెల్లించి కాలనీలకు తరలిస్తామని చెబుతోంది. 45.75 కాంటూర్ ప్రకారం మిగిలిన గ్రామాలను రెండో దశలో తరలిస్తామని ప్రకటించింది. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ నిర్వాసిత కుటుంబానికి రూ.పది లక్షల ప్యాకేజీ, 18 సంవత్సరాలు నిండిన వారికి పరిహారం, గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎకరాకు రూ.లక్షా పదిహేను వేలు పరిహారం ఇచ్చిన భూముల రైతులకు అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానన్న జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటి మాటే మరిచారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు పరిహారం ఇచ్చే తేదీనే కటాఫ్ తేదీగా నిర్ణయించి పరిహారం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రాల్లో నిరాహారదీక్షలు, వేలేరు గ్రామం నుండి కోయిదా వరకూ పాదయాత్ర, దామరచర్ల నుండి గొమ్ముగూడెం వరకూ సైకిల్ యాత్ర వంటి రూపాల్లో నిర్వాసితులు ఆందోళనలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, మండల బంద్, ఐటిడిఎ ముట్టడి, కలెక్టరేట్ ముందు ధర్నా వంటి కార్యక్రమాలు చేపట్టినా అధికారుల హామీలు తప్ప నేటికీ పరిహారం అందలేదు. పునరావాస కాలనీల నిర్మాణం పూర్తి కాలేదు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితులను ఆదుకోవాలి

వై.నాగేంద్రరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

నిర్వాసితులను నట్టేట ముంచే విధానాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీడాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిహారం, పునరావాసానికి నిధులు తీసుకురావాలి. అవసరమైతే రాష్ట్రంలోని అన్ని రాజకీయ, ప్రజాసంఘాలను కలుపుకుని అఖిలపక్షం ఆధ్వర్యాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో నిర్వాసితుల సమస్యల పరిష్కారంతోపాటు పునరావాసం, పరిహారం, ప్యాకేజీ వంటి వాటికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడాలి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతం చేస్తాం.

అసంబద్ధ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు

యుటిఎఫ్ ఏలూరు నగరశాఖ డిప్యుటేషన్ పేరుతో అసంబద్ధంగా సుదూర ప్రాంతాలకు వేయడాన్ని యుటిఎఫ్ ఏలూరు నగరశాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు యుటిఎఫ్ ఏలూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొప్పుకూరి రాజారావు, ఎమ్‌డి ఇక్బాల్ అదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్ పరిధిలో చేయాల్సిన డిప్యుటేషన్, సర్వీస్ రూల్స్‌కి విరుద్ధంగా కొన్ని కొన్ని పాఠశాలకు అసలు రేషనలైజేషన్ చేయాల్సిన అవసరం లేదని, ఇది ఎవరిని కాపాడటానికి అర్థం కావడంలేదని పేర్కొన్నారు. ఒకే పాఠశాలలో కొన్ని సబ్జెక్టులు రేషనలైజేషన్ వర్తింపజేయడం, మిగిలిన సబ్జెక్టులకు రేషనలైజేషన్ లేదని, ఒక్కొక్క విధానం అమలు చేస్తున్నారని, అసలు మున్సిపల్ సర్వీస్ రూల్‌కి విరుద్ధంగా ఇలాంటి డిప్యుటేషన్ వేయడం దారుణమని విమర్శించారు. ఈ అసంబద్ధ డిప్యుటేషన్‌ను రద్దు చేసి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఇంటి రుణం రూ.5 లక్షలకు పెంచాలి

నేడు సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఐదో తేదీన రెవెన్యూ డివిజనల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. జగనన్న కాలనీల సందర్శనలో భాగంగా పాత చింతలపూడిలో జగనన్న కాలనీ లబ్ధిదారులను సిపిఐ బృందం ఆదివారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు లబ్ధిదారులు ఫౌండేషన్ వేసుకోవడానికి సరిపోవడం లేదన్నారు. పెరిగిన ధరల రీత్యా రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ఐదో తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమంలో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బోడ వజ్రం, మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, గ్రామ కార్యదర్శి ముళ్లగిరి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి తొర్లపాటి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముళ్లగిరి లాజరు పాల్గొన్నారు.

యాత్రికులతో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం రద్దీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థానం వద్ద క్యూలైన్లు అన్నీ యాత్రికులతో రద్దీగా మారాయి. చేవూరుపాలెం - సింగరాయపాలెం సెంటర్ యాత్రికులతో కిక్కిరిసిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ ముఖద్వారమునకు వెండి తాపడం తయారీ నిమిత్తం రూ.10,116 ఛైర్మన్ శొంఠి నాగరాజుకు విరాళంగా అందించారు. మచిలీపట్నం ఉడా ఛైర్‌పర్సన్ బొర్రా గంగాభవాని స్వామివారిని దర్శించుకున్నారు.

అలరించిన కూచిపూడి నాట్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థుల కూచిపూడి నాట్యం

స్థానిక చంద్రశేఖర కల్యాణ మండపంలో అభినయ కూచిపూడి నాట్య అకాడమీ 30వ వార్షికోత్సవ వేడుకల్లో ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అలరించింది. ఆదివారం అభినయ నాట్య అకాడమీ నిర్వాహకురాలు శీలా రూపాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా పలు గీతాలకు నృత్యాలు చేసిన నాట్య కళాకారులకు అభినయ నాట్య వీరాజిత, నాట్యనవ మణి, నాట్యరాణి అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు చిన్ని రామసత్యనారాయణ మాట్లాడుతూ కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ మాజీ ఉపాధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో ఎందరో కళాకారులను తయారుచేసిన రూపా దేవి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఘనంగా ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వలవల తాతాజీ, గీత, ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్, మందపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఈశ్వరయ్య

చింతలపూడి:కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని వెంకటాద్రిగూడెంలో వై.ధర్మరాజు తండ్రి పది రోజులు క్రితం మరణించడంతో కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, చింతలపూడి మండల ఉప అధ్యక్షులు ఈశ్వరుడు, మండల ప్రధాన కార్యాదర్శి దత్తు నాగరాజు, కార్యదర్శి సంజయ్ కుమార్, పలువురు జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

చింతలపూడి :పట్టణంలోని ఆర్‌బికెలో చేపడుతున్న ధాన్యం కొనుగోలును తహశీల్దార్ కృష్ణజ్యోతి పరిశీలించారు. తేమశాతం ఎక్కువగా ఉందని, రైతుల వద్ద నుండి ధాన్యం కోనడం లేదంటూ రైతుల చెప్పిన సమస్యలపై సివిల్ సప్లయిస్ డీటీ జరీనా, ఎఒ మీనాకుమారిని వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆర్‌బికె వద్ద తేమశాతం చూడకుండా మిల్లర్ల వద్దకు పంపడంతో మిల్లర్లు ధాన్యం లోడు, తేమ శాతం ఎక్కువగా ఉందని నిలిపివేశారు. మిల్లర్ల వద్ద తేమశాతం 21.8 అండగా ఆర్‌బికే వద్ద 15 శాతం వ్యత్యాసం ఉంది. తేమశాతం చూడకుండా పరీక్షించకుండా ఎలా పంపిస్తారని అగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. వారి సమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కల్తీ పాల పంజా..!

చాపకింద నీరులా విస్తరిస్తున్న తయారీ

ఇటీవల పోలీసులకు చిక్కిన ఇద్దరు వ్యక్తులు

ప్రజాశక్తి - చింతలపూడి

కల్తీపాలు తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ (ఫైల్)

ఎవరైనా అనారోగ్యానికి గురైనా, లేక బలహీనంగా ఉన్నా పాలు తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. కొందరు సులభంగా డబ్బు సంపాదించుకునేందుకు అటువంటి పాలను కూడా కల్తీ చేసి విక్రయిస్తున్నారు. దీంతో ఆ పాలు తాగి అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆరోగ్యానికి మంచిదని తాగుతున్న పాలు కల్తీ కావడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. ఇటువంటి కల్తీ పాలను తయారుచేసేవారిపై చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

పామాయిల్ నూనె, పాల పొడి, యూరియా నీరును వినియోగించి కల్తీ పాలను తయారు చేసి మెట్ట ప్రాంతంలో సరఫరా చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా షాపు పెట్టర్ చేసి ఈ కల్తీ పాలను తయారు చేస్తున్నారు. లింగపాలెం మండలానికి చెందిన కె.మంగయ్య చాలా రోజులుగా గ్రామాల్లో తిరుగుతూ పాలు సేకరించి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. చింతలపూడి మండలంలో కూడా కల్తీ పాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మంగయ్య సేకరించిన పాలతో పాటు కల్తీ పాలు కూడా కలిపి సరఫరా చేస్తున్నాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. మంగయ్య లాగానే కొంతమంది సులభంగా డబ్బు సంపాదించేందుకు కల్తీ పాలను తయారు చేసి ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నారు. గతంలో కూడా లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడేనికి చెందిన వ్యక్తి ఇదే విధంగా కల్తీ పాలను తయారు చేసి సరఫరా చేసేవాడు. అతడిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ రంగ సొసైటీలతో పాటు కొన్ని ప్రయివేట్ కంపెనీలు పాలను కొనుగోలు చేస్తున్నాయి. ప్రయివేట్, ప్రభుత్వ రంగంలో పోటీ కారణంగా ఎక్కువగా అక్రమాలకు ఆస్కారం ఉంటుందని పలువురు చెబుతున్నారు. లక్ష్యాలు నిర్దేశించడం కూడా ఒక రకంగా అక్రమాలు చోటు చేసుకుంటాయని పలువురు అంటున్నారు. జిల్లాలో సుమారు ఏటా ఐదు లక్షల లీటర్ల పాలు దిగుబడి అవుతుంది. చాపకింద నీరులా కల్తీ పాల తయారీ కూడా జరుగుతుంది. ఇటువంటి కల్తీ పాలు తయారు చేసేవారిపై చర్యలు తీసుకుని ఇటువంటి సంఘటనలు జరగకుండా నాణ్యమైన పాలు సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

శ్రీనివాస్, అసిస్టెంట్ ఆహార భద్రత అధికారి

కల్తీ పాలు తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కల్తీ పాల తయారీ గురించి తెలిస్తే మాకు సమాచారం అందించండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

నాన్‌బెయిలబుల్ కేసు, పదేళ్ల జైలు

మల్లేశ్వరరావు, చింతలపూడి సిఐ

కల్తీ పాలు తయారు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తాం. పదేళ్ల జైలు శిక్ష పడుతుంది.

బాలుడి వైద్యానికి సాయం

జంగారెడ్డిగూడెం:స్థానిక రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న గోపాలకృష్ణ శ్రీనివాసన్ రెండు నెలల బాబు వైద్యానికి ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు చిలుకూరి సాయిబాబా ద్వారా పరిషత్ సభ్యులు రూ.తొమ్మిది వేలను బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చిలుకూరి సాయిబాబు మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న పది మందికి ఈ ఏడాది సుమారు రూ.1.50 లక్షలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యవర్గ సభ్యురాలు బి.కృష్ణప్రియ, రాధాకృష్ణ, లంకా నాగకుమార్, గన్నవరపు మాధవరావు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు టిడిపి నేతల పరామర్శ

ముదినేపల్లి :సింగరాయపాలెం షష్టి ఉత్సవాల్లో బాణసంచా పేలి గాయపడి గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని టిడిపి నేతలు ఆదివారం పరామర్శించారు. కొడాలి వినోద్, శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, దావు నాగరాజు, మరీదు రాఘవరావు పరామర్శించినవారిలో ఉన్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం

కైకలూరు రూరల్:వ్యాధులపై అవగాహనుంటే మొండి వ్యాధులనైనా అదుపులో పెట్టొచ్చని పలువురు కళాకారులు అన్నారు. ఆదివారం స్థానిక దానగూడెంలో జిల్లా కలెక్టర్, ఎయిడ్స్ అండ్ లెప్రసి పర్యవేక్షణలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. క్షయ, కుష్టు వ్యాధి నివారణ, స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత తదితర ఆరోగ్య విషయాలపై కళాభారతి బిళ్లపాడు వీధినాటిక బృందం కళాకారులు పాటలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి : టిడిపి

ప్రజాశక్తి - భీమడోలు


రైతులతో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు విమర్శించారు. గుండుగొలనులో ఆదివారం పర్యటించిన ఆయన రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని విమర్శించారు. ధాన్యం తేమ శాతం విషయమై ఆర్‌బికె లెక్కలకు, మిల్లర్ల లెక్కలకు తేడాలు రావడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ మేరకు మిల్లర్లు రైతుల నుంచి ఎక్కువ ధాన్యాన్ని తీసుకుంటున్నారని విమర్శించారు. ఈ విధంగా రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఏమవుతుందోనన్న విషయమై స్పష్టత లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితులతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

వన సంరక్షణ సమితుల ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మండవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బండి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జరిగిన మండలంలోని గండిమెట్ట వద్ద జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ మండలంలోని అప్పలరాజుగూడెం వన సంరక్షణ సమితి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పోరాటాలతో భూమిని దక్కించుకోవడంతోపాటు మన జీవన పరిస్థితులు మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.జయరాజు, కంచర్ల గురవయ్య, బోడా వజ్రం పాల్గొన్నారు.

రైత శ్రేయస్సుకు సహకార సంఘాలు కృషి

కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

భవనాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు, డిఎన్ఆర్

రైతుల శ్రేయస్సు కోసం సహకార సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గురజ గ్రామంలో రూ.26 లక్షలతో పున:నిర్మించిన గురజ గోపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని ఆదివారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. వైసిపి మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఛైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒటిఎస్ పట్టాదారులకు ఎటువంటి ప్రాసెస్ ఛార్జీలు లేకుండా రూ.50వేల చొప్పున రుణం ఇవ్వడానికి కెడిసిసి బ్యాంక్ నిర్ణయించిదని, దీనిని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రైతుల కోసం ఆలోచించే వారినే ఎంఎల్‌ఎ డిఎన్ఆర్ సొసైటీ అధ్యక్షులుగా నియమించడం అభినందనీయమన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 33 మంది నాయకులకు మాత్రమే సొసైటీ నామినేటెడ్ పదవులు దక్కాయన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 47 మందికి నామినేటెడ్ పదవులు లభించడం గొప్ప విషయమన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి పాటుపడే వైసిపి నాయకులనే త్రిసభ్య కమిటీ సభ్యులు, సొసైటీ ఛైర్మన్లుగా నియమించినట్లు తెలిపారు. రైతులకు, పార్టీలకు అతీతంగా సేవలందించే వారికి ఎంఎల్‌ఎ పదవులు ఇవ్వడం అభినందనీయమన్నారు. గురజ సొసైటీ ఛైర్మన్‌గా మేడూరి వెంకటేశ్వరరావును నియమించడంతో సహకార బ్యాంక్ నూతన భవనం, ప్రహరి గోడ, సొసైటీ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సొసైటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు రైతుల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నారన్నారు. ఈ సొసైటీ ఏర్పడి ఇంకో రెండేళ్లలో వందేళ్లు పూర్తవుతుందని చెప్పారు. రైతులకు అన్ని విధాలా సేవలందిస్తున్న సొసైటీ ఛైర్మన్ మేడూరి వెంకటేశ్వరరావును ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు గురజలో నూతన సొసైటీ భవనం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో జగనన్న పరిపాలనలో రైతులందరూ అభివృద్ధిలోకి వచ్చారన్నారు. జగనన్న రైతుల పక్షపాతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పి.సుజాత, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, త్రిసభ్య కమిటీ సభ్యులు పులి నాగమణి, పుట్టి సుబ్రహ్మణ్యం, శివాలయం ఛైర్మన్ మీసాల రామకృష్ణ, వైసిపి నాయకులు కె.గోవిందరాజులు, పగడాల నాగు, ఈడే వెంకటేశ్వరరావు, గోవిందరాజులు, సోమా సత్యనారాయణ, బేతపూడి వెంకటరమణ, షేక్ అల్లాభక్షు, జంపన కోటయ్య, పి.కిరణ్మయి, కె.ప్రవీన్, గంటా కోటేశ్వరరావు, రాచూరి కుమార్, మరీదు వసంతరావు, లేళ్ల ఆంజనేయులు, ఎ.రాం బాబు, డొక్కు శ్రీనివాసరావు, వి.కొండలరావు, గూడపాటి ప్రసాద్, గురజ సొసైటీ సిఇఒ శ్రీను, మండలంలోని అన్ని సొసైటీల ఛైర్మన్లు, సొసైటీ సిఇఒలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


నాగేశ్వరరావును సత్కరిస్తున్న డిఎన్ఆర్

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని పెదపాలపర్రు హైస్కూల్ సమీపంలో ఉన్న కోజిలాన్ ఫ్యాక్టరీ వద్ద నుంచి ప్రారంభమై మండలంలోని దాకరం గ్రామం వద్ద ఈ పనులు ముగుస్తాయి. సుమారు 14 కిలోమీటర్ల పొడవునా మండలంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు ఇచ్చిన మార్కింగ్‌లు ప్రకారం రహదారికి ఇరువైపుల భూములకు సంబంధించి స్థానికులకు నష్ట పరిహారం చెల్లించి తొలగింపు పనులు చేట్టారు. కొందరు స్వచ్ఛందంగా వారి భవనాలను కూలీలతో తొలగించుకుంటున్నారు. రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులు జరగుతున్నాయి. తొలగించిన భవనాల్లో ఉన్న దుకాణాల యాజమానులకు మరో దుకాణం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారులు మాత్రం రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని హోటళ్లు, టీస్టాళ్లు, కూరగాయల విక్రయాలు చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల ఎక్కువమంది వ్యాపారులు మాత్రం దుకాణాలు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దుకాణాల తొలగింపుతో ఒక్కసారిగా స్థానికులు అద్దెరేట్లు అమాంతం పెంచేశారు. దీంతో చిరువ్యాపారులు ఏం చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో మత్స్యకారుల పడవ బోల్తా

ముగ్గురు సురక్షితం - ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి - పోలవరం


కృష్ణమూర్తి

అప్పలరాజు

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంతంలోని గోదావరిలో ఆదివారం సాయంత్రం మత్స్యకారుల పడవ బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు జాలర్లు గల్లంతయ్యారు. మరో ముగ్గరు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఐదుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. స్పిల్ వే వద్ద వడి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పడవబోల్తాపడింది. ఇద్దరు గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ముగ్గరు ఒడ్డుకు రేరారు. గల్లంతైనవారు వాటాల కృష్ణమూర్తి, వాటాల అప్పలరాజుగా పోలీసులు గుర్తించారు. వారికోసం గాలిస్తున్నామని తెలిపారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం గ్రామంలో కోడిపందేల స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి మల్లశెట్టి సతీష్‌తో పాటు మరో ముగ్గరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాజుల కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురికి అదుపులోకి తీసుకుని రూ.ఐదు వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఓటు హక్కుకు దరఖాస్తును అందిస్తున్న యువతి

అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి

ఆగిరిపల్లి:18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తప్ప సరిగా ఓటు హక్కుకు నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు అన్నారు. ఆదివారం ఆగిరిపల్లిలో ఓటరు నమోదు ప్రక్రియ గురించి ప్రజలకు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వై.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : సుబ్బమ్మదేవి హైస్కూల్ రోడ్డు, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్‌ఆర్‌పేట, ఏలూరు.
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
1st ఫ్లోర్, బస్‌స్టాప్ ఎదురు, దేవరపల్లి.
1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పలవెంకన్న సెంటర్,వేల్పూరురోడ్డు, తణుకు
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2620.07 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు

O.S.No. 442/2020

Between:
Vijaya Bank, Now Bank of Baroda ...**Plaintiff**

AND

Jholeti Peda Narasimha Rao
Jholeti Mangatayaru
Vemula Aswani Kumar ...**Defendants**

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ఇరువుతూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
03-12-22. అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU

O.S.No. 204/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...**Plaintiff**

VS

Metla Saraswathi an Others ...**Defendants**

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:

డి-1: మెట్ల సరస్వతి, భర్త: కృష్ణమూర్తి, హిందువు, స్త్రీ, 42 సం॥లు, వ్యవసాయం, డో.నం. 3-17, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

డి-2: వేముల శ్రీనివాస్, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 49 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు,పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU

O.S.No. 349/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...**Plaintiff**

VS

Arepalli Sujatha and Others ...**Defendants**

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:

డి-1: ఆరేపల్లి సుజాత, భర్త: రంగారావు, హిందువు, స్త్రీ, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

డి-2: వేముల రాజేశ్వరరావు, తండ్రి: వెంకట రత్నం, హిందువు, పురషుడు, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

డి.ఎస్.వి.కృష్ణాజీ
అడ్వకేట్, ఏలూరు.

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు

O.S.No. 376/2020

Between:
Vijaya Bank, Now Bank of Baroda ...**Plaintiff**

AND

Meesala Satyanarayana
Meesala Nageswara Rao ...**Defendants**

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ఇరువురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ఇరువుతూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, ఓ.ఎన్.కృష్ణ
03-12-22. అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU

O.S.No. 298/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...**Plaintiff**

VS

Midde Sita an Others ...**Defendants**

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:

డి-1: మిద్దే సీత, భర్త: రంగారావు, హిందువు, స్త్రీ, 50 సం॥లు, వ్యవసాయం, డో.నం. 15-2-3ఎ, శంభునిపేట, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.

డి-2: తొంట జ్యోతి లక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 43 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 25-8-12, శంభునిపేట, పాలకొల్లు పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

ఎన్.రవి శంకర్
అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU

O.S.No. 170/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...**Plaintiff**

VS

Arepalli Seetharatnam an Others ...**Defendants**

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:

డి-1: ఆరేపల్లి సీతారత్నం, భర్త: శంకర, హిందువు, స్త్రీ, వ్యవసాయం, డో.నం. 9-82, 40 సం॥లు, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

డి-2: వేముల యర్రియ్య, తండ్రి: సూరన్న, హిందువు, పురుషుడు, 50 సం॥లు, వ్యవసాయం, గగ్గిపర్రు గ్రామం, యలమంచలి మండలం, నర్సాపురం జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.06-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TANUKU

O.S.No. 598/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank) Alamuru ...**Plaintiff**

VS

Vemula Raja Rajeswari and Others ...**Defendants**

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:

డి-1: వేముల రాజరాజేశ్వరి, తండ్రి: అశ్వని కుమార్, హిందువు, స్త్రీ, డాక్టర్, డో.నం. 22-5-8, 24 సం॥లు, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.

డి-2: వేముల అశ్వని కుమార్, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 52 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.

డి-3: వేముల శారద, భర్త: అశ్వని కుమార్, హిందువు, స్త్రీ, 46 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు జె.సి.జె.సి.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.08-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొన వలసిందిగాను** అట్లు కాని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

టి.రమాదేవి
అడ్వకేట్, తణుకు.